


# కెరటం న్యూస్

(సామాన్యుడి ఆయుధం)




Published from.. Hyderabad, Khammam, Warangal, Nalgonda

సంపుటి : 04 సంచిక : 241 | మంగళవారం 02- సెప్టెంబర్ 2025 | ఎడిటర్ : వనం నాగయ్య | పేజీలు : 4 ఫోన్ : 9441877695

## బెదిరింపులు, కేసులు

# బీఆర్ఎస్‌కు కొత్త కాదు



- కాళేశ్వరాన్ని ఎండబెట్టే కుట్రలో కాంగ్రెస్, బీజేపీ చేతులు కలిపాయ్
- సీబీఐకి కాళేశ్వరం అప్పగింపు అంటే ప్రాజెక్టు మూసివేతే
- కేసులు, బెదిరింపులు కొత్తవి కావు, ప్రజల కోసం పోరాటమే ధ్యేయం
- కాళేశ్వరంపై రేవంత్ మాట మార్పు వెనుక అసలు కుట్రను బయటపెట్టాలి: కేటీఆర్

## దేశంలోనే అతిపెద్ద కుంభకోణం 'కాళేశ్వరం'.. ఎంపీ లక్ష్మణ్



న్యూస్ డెస్క్, 01 సెప్టెంబర్ (కెరటం న్యూస్): దేశంలోనే అతిపెద్ద కుంభకోణం కేసీఆర్ కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టేనని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్ ఆరోపించారు. సోమవారం బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బీజేపీ ద్వారానే బీసీలకు న్యాయం జరుగుతుందని యావత్ బీసీ సమాజం ప్రధాని నరేంద్ర మోదీ పై విశ్వాసంతో ఉందన్నారు. బీసీల హక్కులు, సంక్షేమం, అభ్యున్నతి కోసం బీసీలు బీజేపీ వైపు చూస్తున్నారని తెలిపారు. దొంగలు పడిన ఆరు నెలలకు.. కుక్కలు మొరిగిన చందంగా రేవంత్ సర్కార్ తీరు ఉందని కామెంట్ చేశారు.

## ఆ ఒక్క కారణంగానే పోటీ చేస్తున్నా!

ఉపరాష్ట్ర పతి ఎన్నికల గురించి సుదర్శన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు




న్యూస్ డెస్క్, 01 సెప్టెంబర్ (కెరటం న్యూస్): తాను ఇండియా కూటమి అభ్యర్థిని కాదని, ప్రతిపక్షాల అభ్యర్థిని అని ఇండియా కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డి తెలిపారు. రాజ్యాంగాన్ని కాపాడటం కోసమే ఉపరాష్ట్ర పతి ఎన్నికల్లో పోటీ చేస్తున్నా అని స్పష్టం చేశారు. రాజకీయం అనే ముళ్ల కిరీటాన్ని ఎందుకు నెత్తిన పెట్టుకున్నారని చాలా మంది తనను అడిగారని చెప్పారు. తాను రాజకీయాల్లో ప్రవేశించలేదని, ఏ పార్టీలో సభ్యత్వం లేదని, ఇక ముందు కూడా ఉండదని పేర్కొన్నారు. పౌరహక్కులు, సామాజిక న్యాయం గురించి మాట్లాడుతా అని సుదర్శన్ రెడ్డి తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని తాజ్ కృష్ణలో సీఎం రేవంత్ రెడ్డితో సుదర్శన్ రెడ్డి భేటీ అయ్యారు.'ఇదొక అపూర్వైన, అనిర్వచనీయమైన అనుభూతి. ఇంతపెద్ద బాధ్యత నేను మోయగలుగుతానా?, సఫలీకృతున్ని అవుతే అనే ఆలోచనలు వచ్చాయి. నా ప్రత్యర్థి కనబడరు, ఎక్కడున్నారు తెలియదు. అభ్యర్థులు ఇద్దరు మాట్లాడితే.. సంభాషణ ఉంటే తెలుస్తుంది. నన్ను కొంతమంది మీడియా మిత్రులు అడిగారు, ఎందుకు ఈ ముల్లకిరీటం పైకి వస్తున్నారు అని. నేను ఒకటే చెప్పాను.. 53 ఏళ్లుగా భారత రాజ్యాంగతో నా ప్రయాణం సాగుతోంది. అది ప్రమాదంలో పడింది..

---

ఇప్పటికే ఆలస్యమైంది..

## భారత్‌లో అమ్మలేకపోతున్నాం'



న్యూస్ డెస్క్, 01 సెప్టెంబర్ (కెరటం న్యూస్): రష్యా ఆయిల్‌ను కొనుగోలు చేస్తున్నందుకు భారత వస్తువులపై 25 శాతం అదనపు సుంకాన్ని విధించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. మరోసారి అక్కసు వెళ్లగక్కారు.

# సమగ్ర నివేదిక సమర్పిస్తే

## కేంద్రం దృష్టికి తీసుకెళతా: సీఎం రేవంత్

- SDRF నిధుల వినియోగంలో అలసత్వంపై అధికారులపై సీఎం రేవంత్ ఆగ్రహం
- వరద నష్టంపై కేంద్రానికి నివేదికలు అందించేందుకు ప్రభుత్వం సిద్ధం
- విపత్తులపై వేగవంతమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు సీఎం సూచనలు

న్యూస్ డెస్క్, 01 సెప్టెంబర్ (కెరటం న్యూస్): ఇటీవలి భారీ వర్షాలు, వరదలతో దెబ్బతిన్న రోడ్లు, భవనాలు, చెరువులు, కుంటలకు మరమ్మతులు చేపట్టడంతో పాటు విద్యుత్ సబ్ స్టేషన్ల పునర్నిర్మాణం పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. రాష్ట్ర విపత్తు ఉపశమన నిధులు (SDRF) నిధులున్నా నిబంధనల ప్రకారం వాటిని వ్యయం చేయడంలో అలసత్వం చూపడంపై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.



## నాలుగేళ్లు తెలంగాణలో

# చదివితేనే లోకల్..



సుప్రీంకోర్ట్ సంచలన తీర్పు..

న్యూస్ డెస్క్, 01 సెప్టెంబర్ (కెరటం న్యూస్): తెలంగాణలో లోకల్ కోటా కింద ఉన్నత విద్య అభ్యసించాలని అనుకుంటున్నారా అయితే ఒక్క క్షణం ఆగండి. స్థానికత అంశంపై సుప్రీంకోర్ట్ సంచలన తీర్పునిచ్చింది. తెలంగాణలో వరుసగా 9 ,10, 11,12 తరగతులు చదువితేనే లోకల్ అంటూ స్పష్టం చేసింది. అయితే ఈ రూల్స్ లో ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలకు మాత్రం మినహాయింపు ఉంటుందనే షరతు పెట్టింది సుప్రీం కోర్ట్. లోకల్ రిజర్వేషన్ అంశంపై తెలంగాణకు ఊరట కలిగించేలా సుప్రీంకోర్టు కీలక తీర్పునిచ్చింది. వరుసగా నాలుగేళ్లు అంటే 9వ, 10వ, 11వ, 12వ తరగతులు తెలంగాణలో చదివితేనే స్థానికుడిగా పరిగణించాలని స్పష్టంచేసింది. అయితే, ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలకు మాత్రం మినహాయింపు ఇచ్చింది. స్థానికత అంశంలో రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓ నెంబర్ 33కి అత్యున్నత న్యాయస్థానం పూర్తి స్థాయి మద్దతు తెలిపింది.

---



## సంతోశ్ రావు, హరీశ్ రావు వల్లే

# కేసీఆర్ కు అవినీతి మరక..

- కేసీఆర్‌కు అవినీతి ముద్రకు కారణం సంతోష్, హరీశ్
- బీఆర్ఎస్ పార్టీ ఉంటే ఏంటి, పోతే ఏంటి?
- నా మీద ప్రచారం చేస్తే తోలు తీస్తా - సోషల్ మీడియా ట్రోల్స్‌కు కవిత వార్నింగ్
- కేసీఆర్ పేరును చెడగొట్టినవాళ్లు ఆయన పక్కవాళ్లే
- రేవంత్ వెనుక హరీష్, సంతోష్ ఉన్నారు - కాంగ్రెస్-బీఆర్ఎస్ ముసుగు కూటమిపై కవిత ఆరోపణ

న్యూస్ డెస్క్, 01 సెప్టెంబర్ (కెరటం న్యూస్): కేసీఆర్ కు అవినీతి మరక అంటడానికి మాజీ ఎంపీ సంతోష్ రావు, హరీశ్ రావు, మెఘా కృష్ణారెడ్డే కారణం అని తెలంగాణ జ్యాగతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ తెలంగాణ ప్రజల కోసం, నీళ్ల కోసం ఆలోచిస్తుంటే వీళ్లు సొంత వనరులు, ఆస్తులు పెంచుకోవడం కోసం ఆలోచన చేశారని సోమవారం మీ వళ్ల తెలంగాణ ఉద్యమంతో సంబంధం లేని రేవంత్ రెడ్డి కేసీఆర్ పై సీబీఐ ఎంక్వైరీ వెయించే పరిస్థితి వచ్చిందని అన్నారు. అమెరికా పర్యటన ముగించుకుని సోమవారం హైదరాబాద్ కు తిరిగి వచ్చిన కవిత సోమవారం సాయంత్రం తెలంగాణ జాగృతి కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. హరీశ్ రావు, సంతోష్ రావు నాపై అనేక కుట్రలు చేసినా నేను భరించాను. మీడియా ద్వారా రకరకాలుగా నాపై వ్యక్తిగత దాడిలో నేనెప్పుడు వారి పేరు పెట్టి అనలేదు.

## హరీశ్‌రావుకు మద్దతుగా బిఆర్ఎస్ పోస్టు

- ఇది ఆరడుగుల బుల్లెట్టు.. అసెంబ్లీలో హరీశ్ ప్రసంగంపై భారత రాష్ట్రసమితి పోస్టు
- హరీశ్‌రావును డైనమిక్ లీడర్‌గా పోల్చిన కేటీఆర్.. అసెంబ్లీలో మాస్టర్ క్లాస్ ఇచ్చారని ప్రశంసలు

అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై ఆదివారం మాట్లాడిన మాజీ మంత్రి హరీశ్‌రావుకు మద్దతుగా భారత రాష్ట్రసమితి ఎక్స్‌లో పోస్టు చేసింది. ఇది ఆరడుగుల బుల్లెట్టు అంటూ ఎక్స్‌లో రాసుకొచ్చింది.

# సీపీఎస్ ఉద్యోగులకు...

## ఇదే చివరి విద్రోహదినం కావాలి..!

తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి



## కవిత వ్యాఖ్యలతో అవినీతి జరిగిందనేది స్పష్టమైంది



న్యూస్ డెస్క్, 01 సెప్టెంబర్ (కెరటం న్యూస్): మాజీ సీఎం కేసీఆర్‌పై కొందరు అగ్రనేతలు కుట్రలు చేస్తున్నారని.. వారి వెనుక సీఎం రేవంత్ రెడ్డి ఉన్నారంటూ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యల చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం హైదరాబాద్‌లో తెలంగాణ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ స్పందించారు. సీఎం రేవంత్ రెడ్డిపై కల్వకుంట్ల కవిత వ్యాఖ్యలను ఆయన ఖండించారు. కవిత చేసిన ఈ వ్యాఖ్యల ద్వారా కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందని తేలిపోయిందని స్పష్టం చేశారు.కాళేశ్వరంలో తప్పు చేసింది కేసీఆరా? లేదా హరీశ్ రావా? అనేది తమకు అనవసరమన్నారు. వారి ప్రభుత్వ హయాంలోనే ఈ స్కాం జరిగిందనేది స్పష్టమైందని తెలిపారు. కవిత సైతం ఇప్పుడు అదే చెప్పారంటూ పీసీసీ చీఫ్ కుండ బద్దలు కొట్టారు. అయితే కాళేశ్వరం ప్రాజెక్ట్ అవినీతిలో మామ కేసీఆర్ వాటా ఎంత..? అల్లుడు హరీశ్ రావు వాటా ఎంత..? అనేది తేలాల్సి ఉందన్నారు.

కెరటం న్యూస్



# భారత రాష్ట్ర సమితి పని అయిపోయినట్లే

## : మంత్రి కోమటిరెడ్డి



**న్యూస్ డెస్క్, 01 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** భారత రాష్ట్రసమితి పని అయిపోయినట్లేనని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. కవితను పార్టీ నుంచి సస్పెండ్ చేయకపోతే హరీశ్‌రావు ఊరుకోరని, వేరే పార్టీ పెట్టుకుంటారని వ్యాఖ్యానించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. " పార్టీనేతలు కొందరు ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రానికి వెళ్లి కేసీఆర్‌ను కలిశారు. కవిత విషయంపై రేపు ఆలోచిద్దామని ఆయన అన్నారట. కేసీఆర్, కవిత కుటుంబ గొడవలో తలదూర్చం. కాంగ్రెస్, సీఎంపై మాట్లాడితే సహించేది లేదు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరినట్లు జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక ఇచ్చింది. దీనిపై విచారణ జరపాలని సీబీఐకి కూడా అప్పగించాం. అవినీతి చేసినవాళ్లెవరో సీబీఐ విచారణలో తెలుస్తుంది. రాష్ట్రంలో మరో 15 ఏళ్లు కాంగ్రెస్ అధికారంలో ఉంటుంది." అని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు.

# ఇప్పటికే అణుబాంబు పేల్చాం.. త్వరలో హైడ్రోజన్ బాంబు పేలుస్తాం : రాహుల్‌గాంధీ

**న్యూస్ డెస్క్, 01 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** ఓట్ల చోరీ కి సంబంధించి తాము ఇప్పటికే అణుబాంబు పేల్చామని, త్వరలోనే మరింత శక్తిమంతమైన హైడ్రోజన్ బాంబు పేలుస్తామని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడు, రాయ్‌బరేలీ ఎంపీ రాహుల్ గాంధీ అన్నారు. ఆ తర్వాత ప్రధాని నరేంద్ర మోదీ గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటారని చెప్పారు. 'ఓటర్ అధికార్ యాత్ర ' ముగింపు సందర్భంగా పట్నాలో నిర్వహించిన కార్యక్రమంలో రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు.

'రాజ్యాంగాన్ని దెబ్బతీసేందుకు బీజేపీ ప్రయత్నిస్తోంది. అందుకు మేం అనుమతించబోం. బీజేపీని అడ్డుకునేందుకే ఈ యాత్ర నిర్వహించాం. దీనికి ప్రజల నుంచి అద్భుతమైన స్పందన వచ్చింది. మహారాష్ట్రలో, కర్ణాటకలో ఓట్ల చోరీ జరిగిందని ఆధారాలతో సహా చూపించాం. ఓట్ల చోరీ అంటే.. హక్కుల చోరీ, ప్రజాస్వామ్య చోరీ, ఉపాధి చోరీ అన్నట్లే. ఈ వ్యవహారంలో త్వరలోనే హైడ్రోజన్ బాంబు పేలుస్తాం' అని రాహుల్ గాంధీ అన్నారు.

అయితే 'ఓటరు అధికార్ యాత్ర' ముగింపు సందర్భంగా ఇండియా కూటమి నేతలు పట్నాలో నిర్వహించిన 'గాంధీ సే అంబేడ్కర్' మార్చ్‌ను పోలీసులు మార్గమధ్యలో అడ్డుకున్నారు. దాంతో నేతలు అక్కడే ప్రసంగించారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాని మోదీ ఓట్ల చోరీ ద్వారా గెలవడానికి యత్నిస్తున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆరోపించారు. ఎన్డీయే డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఓడిపోతుందని జోస్యం చెప్పారు.

బీహార్‌లో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ క్రమంలో రాహుల్ గాంధీ 'ఓటరు అధికార్ యాత్ర' చేపట్టారు. ఆగస్టు 17న ససారాంలో మొదలైన ఈ యాత్ర 25 జిల్లాల్లోని 110 అసెంబ్లీ నియోజకవర్గాల మీదుగా 1,300 కిలోమీటర్ల మేర కొనసాగింది. బీహార్‌లో ఓటర్ల జాబితా 'ప్రత్యేక సమగ్ర సవరణ' ప్రక్రియ మొదలుకొని మహిళా సమస్యలు, రైతు సమస్యలు, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, పారిశ్రామికాభివృద్ధి వంటి అంశాలను లేవనెత్తుతూ రాహుల్‌గాంధీ స్థానికులకు చేరువయ్యే ప్రయత్నం చేశారు.


# బెదిరింపులు, కేసులు బీఆర్ఎస్‌కు కొత్త కాదు: కేటీఆర్

**న్యూస్ డెస్క్, 01 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** కాళేశ్వరంపై కాంగ్రెస్ పార్టీ చేస్తున్న కుట్రలకు నిరసనగా ఇవాళ, రేపు రెండు రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలకు బీఆర్ఎస్ పిలుపునిచ్చింది. మండల మరియు జిల్లా కేంద్రాల్లో వివిధ రూపాల్లో బీఆర్ఎస్ శ్రేణులు నిరసన తెలపనున్నాయి. ఈ క్రమంలో ధర్నాలు, రాస్తారోకోలు, బైక్ ర్యాలీలు ఇతర నిరసన రూపాల్లో నిరసనలకు బీఆర్ఎస్ సిద్ధమవుతున్నది.

బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కాళేశ్వరంపై కాంగ్రెస్ పార్టీ కుట్ర చేస్తున్నదని ఆరోపించారు. తెలంగాణ వరప్రదాయిని కాళేశ్వరం ప్రాజెక్టును శాశ్వతంగా మూసేసి నదీ జలాలను ఆంధ్రాకు తరలించేందుకు రేవంత్ కుట్ర పన్నుతున్నారని మండిపడ్డారు. బీజేపీ-కాంగ్రెస్ కలిసి చేస్తున్న ఈ కుట్రలను ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. ఇది కేసీఆర్‌పై చేస్తున్న కుట్ర మాత్రమే కాదని.. తెలంగాణ నదీ జలాలను పక్క రాష్ట్రాలకు తరలించి, కాళేశ్వరాన్ని ఎండబెట్టే ప్రయత్నంలో భాగంగానే జరుగుతున్నదని తెలిపారు.

సీబీఐకి కాళేశ్వరం అప్పజెప్పడం అంటే పూర్తిగా ప్రాజెక్టును మూసేయడమే అని కేటీఆర్ అనుమానం వ్యక్తం చేశారు. నిన్నటిదాకా సీబీఐ పైన వ్యతిరేకంగా మాట్లాడిన రేవంత్ రెడ్డి ఒక్కరోజులోనే మాట ఎందుకు మార్చాడని నిలదీశారు. దీని వెనుక ఉన్న శక్తులు వాటి ఉద్దేశాలు ఏమిటో ప్రజలకు తెలియజెప్పాలని డిమాండ్ చేశారు. ఇది కచ్చితంగా కాంగ్రెస్ బీజేపీ ఆడుతున్న నాటకమని.. వాళ్ళు చేస్తున్న కుట్రనే అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ సీబీఐకి ఇచ్చినా ఏ ఏజెన్సీకి ఇచ్చినా భయపడేది లేదని కేటీఆర్ స్పష్టం చేశారు. కేంద్రంతో కలిసి కాంగ్రెస్ చేస్తున్న కుట్రలను ఎదుర్కొంటామని తెలిపారు. బెదిరింపులు కేసులు బీఆర్ఎస్ పార్టీకి కొత్త కాదని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాల కోసం ఎన్ని పోరాటాలైనా, త్యాగాలైనా చేస్తామని స్పష్టం చేశారు.

# ఇప్పటికే ఆలస్యమైంది.. భారత్‌లో అమ్మలేకపోతున్నాం'



**న్యూస్ డెస్క్, 01 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** రష్యా ఆయిల్‌ను కొనుగోలు చేస్తున్నందుకు భారత వస్తువులపై 25 శాతం అదనపు సుంకాన్ని విధించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. మరోసారి అక్కసు వెళ్లగక్కారు. షాంఘై సదస్సు లో చైనా, రష్యా అధ్యక్షులతో భారత ప్రధాని మోదీ కలిసి కీలక అంశాలపై ముందడుగు వేసిన తరుణంలో ట్రంప్ తన మనసులోని మాటను బయటపెట్టారు.

అమెరికాకు భారత్ అత్యధికంగా ఎగుమతులు చేసుకుంటూ భారీగా లాభపడిందని, అదే సమయంలో తమ వస్తువులు భారత్‌లో దిగుమతి చేసుకోవడానికి మాత్రం చాలా పరిమిత సంఖ్యలో మాత్రమే అవకాశం ఇచ్చిందన్నారు.

'మా దేశానికి భారత్ పలు రంగాల ఎగుమతులు చేసుకుంటూ భారీ లబ్ధి పొందుతోంది. కానీ మమ్మల్ని భారత్ మార్కెట్‌లోకి వచ్చే అంశంలో మాత్రం చాలా పరిధిలోనే ఉంచుతుంది. మా దేశం నుంచి భారత్ దిగుమతి చేసుకునేవి చాలా తక్కువ. చివరకు ఆయిల్ కొనుగోలు విషయంలో కూడా రష్యాకే భారత్ అధిక ప్రాధాన్యం ఇస్తుంది. అమెరికా నుంచి భారత్ కొనే ఆయిల్ చాలా తక్కువ పరిమితిలోనే ఉంటుంది.

ఇప్పుడు తాము భారత్‌కు దిగుమతి చేసే వస్తువుల విషయంలో టారిఫ్‌ల్లో .జీరోశాతం ఇస్తామని ఆఫర్ చేసింది. ఆ సమయం దాటి పోయింది. ఇది గతేడాది క్రితం జరిగాలి. ఇప్పటికే చాలా ఆలస్యమైంది. భారత్ అధక సుంకాల కారణంగా మా వస్తువుల్ని భారత్‌లో అమ్మలేకపోతున్నాం' అని పేర్కొన్నారు.

ఇది ఏకపక్ష విధ్వంసంగా ట్రంప్ అభివర్ణించారు. భారత్ అమెరికాకు భారీగా వస్తువులు అమ్ముతూ, అమెరికా కంపెనీలకు భారత మార్కెట్‌లో ప్రవేశం ఇవ్వకుండా "అత్యధిక టారిఫ్‌లు విధిస్తూ వచ్చిందన్నారు. అయితే ఇప్పుడు భారత్ సుంకాలను తగ్గించేందుకు సిద్ధమైందని, కానీ అది ఇప్పటికే చాలా ఆలస్యమైపోయిందన్నారు.

ఇదిలా ఉంచితే, భారత్ వస్తువులపై తొలుత 25 శాతం సుంకాలు విధించిన ట్రంప్.,. ఆపై రష్యన్ ఆయిల్ కొనుగోలు పేరుతో భారత్‌పై మరో 25 శాతం సుంకాన్ని విధించారు. ఫలితంగా భారత్‌పై 50 శాతం సుంకాల భారం పడింది. ఇది భారత్ ఎగుమతులపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. వస్త్రాలు, ఆభరణాలు, సముద్ర ఉత్పత్తులు, చర్మ ఉత్పత్తులు ఇలా పలు రంగాలపై అమెరికా సుంకాల భారాన్ని భారత్ భరించాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరొకవైపు భారత ప్రధాని నరేంద్ర మోదీ సైతం ఆత్మనిర్భర్ భారత్‌ను ప్రోత్సహిసత?ఊ దేశీయ ఉత్పత్తుల వినియోగాన్ని పంచాలని ప్రజలకు పదే పదే పిలుపునిస్తూ వస్తున్నారు.

# సంతోశ్ రావు, హరీశ్ రావు వల్లే కేసీఆర్ కు అవినీతి మరక..

కానీ కేసీఆర్ కు ఈ వయసులో సీబీఐ ఎంక్వైయిరీ ఏంది? ఎందుకోసం ఆ ఖర్మ పట్టింది. ఇటువంటి వాళ్లను చూస్తూ ఎందుకు రక్షణ కల్పించాలి. బీఆర్ఎస్ సోదరులకు కోపం రావొచ్చు. కానీ వాస్తవాలు చేదుగా ఉన్నా అప్పుడప్పుడు మాట్లాడాలన్నారు.

ఇలా చెప్పుకుంటే పోతే చాలా అంశాలు ఉన్నాయని రాజకీయాల్లో 40 ఏళ్లకు పైగా ఉన్నా నా పెళ్లప్పుడు డబ్బుల కోసం ఇబ్బంది పడిన వ్యక్తి కేసీఆర్. ఏనాడు ఆస్తులపై ఆశలేదన్నారు. అటువంటి వ్యక్తిని పట్టుకుని సీబీఐ ఎంక్వైయిరీ వేస్తామంటే దీనికంతటికీ ఎవరు కారణం అని ప్రశ్నించారు. కబర్దార్ బిడ్డా.. పక్కరాష్ట్రం ఎజెండాను అమలు చేస్తున్న వ్యక్తి రేవంత్ రెడ్డి.. నిన్న ఉదయం నుంచి రాత్రి వరకు కేసీఆర్ ను అనరాని మాటలు అన్నారు. వింటుంటే గుండె తరుక్కుపోతుంది. కేవలం రాజకీయ లబ్ధికోసం కేసీఆర్ ను విమర్శిస్తున్నారు. కేసీఆర్ పై డబ్బుపై ధ్యాస లేదని గతంలో ఇదే రేవంత్ రెడ్డి చెప్పారని అటువంటి కేసీఆర్ పై ఇప్పుడెందుకు ఇంతటి అబండాలు వేస్తున్నారని నిలదీశారు. సంతోష్ రావు, హరీశ్ రావు వెనుక రేవంత్ రెడ్డి ఉన్నారని కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. ఏసీబీ కాళేశ్వరంలో పని చేసిన ముగ్గురు ఇంజినీర్లపై రెయిడ్లు చేస్తే ఒక్కొక్కరికి వద్ద వందల కోట్ల ఆస్తులు వెలుగు చూశాయి. వారి వెనుక ఎవరున్నారో ఎంక్వైయిరీ చేసే దమ్ము ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎందుకు లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ వీళ్లను మాత్రం ఏమి అనకుండా కేవలం కేసీఆర్ ను మాత్రమే టార్గెట్ చేస్తారు. రేపటి నుంచి సోషల్ మీడియా బ్యాచ్ నన్ను బీఆర్ఎస్, కాంగ్రెస్ ఆపరేట్ చేస్తున్నారని ప్రచారం చేస్తారు. ఖబర్దార్ బిడ్డా.. నేను ఎవరో చెప్తే ఆడే తోలుబొమ్మను కాను. నాది కేసీఆర్, తెలంగాణ రక్తం. వ్యక్తిగతంగానే నేను ఈ కామెంట్స్ చేస్తున్నాన్నారు. కేసీఆర్ పై అబండాలు వేసే అవకాశం ఎవరిచ్చారో బీఆర్ఎస్ శ్రేణులు, తెంలగాణ ప్రజలు ఆలోచన చేయాలన్నారు. కేసీఆర్ పై ఈ అవినీతి మరక వస్తుందో ఆలోచించాలన్నారు. కొంతమంది కేసీఆర్ పక్కనున్నవాళ్లు కేసీఆర్ పేరు చెప్పుకుని అనేక రకాలుగా లబ్ధి పొంది, వారు చేసిన అనేక చెత్త పనుల వల్ల కేసీఆర్ పేరు బద్నాం అయ్యే పరిస్థితి వచ్చిందన్నారు. అయినా వారినే మోస్తాం.. వారినే ముందుకు తీసుకువెళ్తామంటే పార్టీ ఎలా ముందుకు వెళ్తుందని ప్రశ్నించారు. పార్టీ ఉంటే ఏంటీ పోతే ఏంటీ: బీఆర్ఎస్ పార్టీ ఉంటే ఏంటీ పోతే ఏంటి అని కవిత హాట్ కామెంట్స్ చేశారు. కేసీఆర్ మీద ఎంక్వయిరీ వేసినందుకు స్థానిక సంస్థల్లో నష్టం జరిగితే జరగచ్చు అన్నారు. నా మీద సోషల్ మీడియా లో ప్రచారం చేస్తే తోలు తీస్తానని హెచ్చరించారు. కాంగ్రెస్ కు దమ్ము ధైర్యం ఉంటే నేను పేర్లు చెప్పిన వారి మీద చర్యలు తీసుకోవాలన్నారు. ఒక బిడ్డగా నేను బాధపడుతున్నాన్నాన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రకాలుగా విఫలం అయిందని, అనునిత్యం కేసీఆర్ ను విమర్శిస్తూ ఆయన పేరును జపించడం తప్పితే ప్రజలకు ఏం చేస్తున్నారో చెప్పడం లేదన్నారు.

# హరీశ్‌రావుకు మద్దతుగా బిఆర్ఎస్ పోస్టు

సింహం సింగిల్‌గానే వస్తుందంటూ హరీశ్‌రావును ఉద్దేశించి భారత రాష్ట్ర సమితి పోస్టు చేసింది. కాళేశ్వరంపై కాంగ్రెస్ ప్రచారాన్ని ఆధారాలతో సహా తిప్పికొట్టారని పేర్కొంది. మరోవైపు భారత రాష్ట్ర సమితి అధికారిక వాట్సప్ గ్రూప్‌ల నుంచి కవిత పీఆర్‌వోను పార్టీ తొలగించింది. కవిత ప్రెస్‌నోట్, వీడియో క్లిప్పులను సైతం వాట్సప్ గ్రూప్‌ల నుంచి తొలగించింది. అంతేకాకుండా హరీశ్‌రావు, సంతోష్‌కు వ్యతిరేకంగా ఉన్న వ్యాఖ్యల సారాంశాన్ని కూడా డిలీట్ చేసింది.

కాళేశ్వరం ప్రాజెక్టుపై నిన్న అసెంబ్లీలో చర్చ జరిగిన సందర్భంగా కాంగ్రెస్ తప్పుడు ప్రచారాన్ని బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు సాక్ష్యాధారాలతో తిప్పికొట్టారు. నిండుసభలో సీఎం సహా మంత్రులు మూకుమ్మడి దాడిచేసినా.. ఒక్కొక్కరికీ సమాధానమిస్తూ హరీశ్‌రావు సభలో చుక్కలు చూపించారు.. అధికార కాంగ్రెస్ అడ్డగోలు వాదనను ఎక్కడికక్కడ చీల్చి చెండారు. కాగా, నిన్న అసెంబ్లీలో హరీశ్‌రావు చేసిన ప్రసంగంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెట్ కేటీఆర్ ప్రశంసలు కురిపించారు. హరీశ్‌రావును ట్యాగ్ చేస్తూ ట్విట్టర్(ఎక్స్)లో పోస్టు పెట్టారు.

ఇది నిజంగా మన డైనమిక్ లీడర్ హరీశ్‌రావు ఇచ్చిన ఒక మాస్టర్ క్లాస్ అని కేటీఆర్ అన్నారు. కేసీఆర్ సమర్థవంతమైన శిష్యుడు హరీశ్‌రావు అని కొనియాడారు. కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు అయిష్టంగా అయినా సరే.. హరీశ్‌రావు నుంచి ఇరిగేషన్‌పై చాలా విషయాలు నేర్చుకున్నారని తెలిపారు.

**కేసీఆర్‌తో భారత రాష్ట్ర సమితి నేతల భేటీ**

ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో మాజీ సీఎం కేసీఆర్‌ను భారత రాష్ట్ర సమితి నేతలు కలిశారు. కేటీఆర్, ప్రశాంత్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి తదితరులు ఆయనతో సమావేశమయ్యారు. కాళేశ్వరం అంశాన్ని సీబీఐకి అప్పగిస్తామన్న ప్రభుత్వ ప్రకటనపై చర్చించినట్లు తెలుస్తోంది.

# దేశంలోనే అతిపెద్ద కుంభకోణం 'కాళేశ్వరం'.. ఎంపీ లక్ష్మణ్ కీలక వ్యాఖ్యలు

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన 22 నెలల తర్వాత కాళేశ్వరంపై విచారణకు సీబీఐకి ఇవ్వాలని కనువిప్పు కలిగిందా అని సెటైర్లు వేశారు.

కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతి, కుంభకోణం సీబీఐ దర్యాప్తు ద్వారా వాస్తవాలు వెలుగులోకి లక్ష్మణ్ అన్నారు. నిజం నిగ్గుతేల్చే సంస్థ సీబీఐ మాత్రమేనని తెలిపారు. అయితే, గతంలో పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న రేవంత్ రెడ్డి కాళేశ్వరం ప్రాజెక్టు ను రీడిజైన్ చేసి తెలంగాణ సంపదను దోచుకోవడానికి, కాంట్రాక్టర్లకు మేలు చేసేందుకు అధికారులు వత్తాసు పలికారని ఆరోపించారు. దేశంలోనే అతిపెద్ద కుంభకోణం కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టేనని అన్నారు. రూ.38 వేల కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ప్రాజెక్టును రూ.లక్ష కోట్ల పైచిలుకు నిధులతో నిర్మించమే అందుకు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కల్వకుంట్ల కుటుంబం కాళేశ్వరాన్ని ఏటీఎంగా మార్చుకుందనే పలుమార్లు తెలంగాణ బహిరంగ సభలో అన్నారని గుర్తు చేశారు. పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్ ఉన్నప్పుడు కాళేశ్వరంపై సీబీఐ దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారని.. అధికారంలోకి రాగానే మాట మార్చారని కామెంట్ చేశారు. కాంగ్రెస్ , బీఆర్ఎస్ మధ్య చీకటి ఒప్పందంతో కేవలం కాలయాపన కోసం జస్టిస్ చంద్రఘోష్ కమిషన్ వేశారని లక్ష్మణ్ ఆరోపించారు.

# ఆ ఒక్క కారణంగానే పోటీ చేస్తున్నా!

దాన్ని కాపాడటమే నా ధ్యేయం. రాజ్యాంగానికి నిబద్ధతతో ఉంటాను.. నిబద్దుడిగా ఉండటమే కాదు కాపాడుతాను. నా ప్రయాణానికి బ్రేక్ ఇవ్వలేదు. నేను ఏ పార్టీలో చేరలేదు. రాజ్యాంగ పరంగా ఓటు వేసే ప్రతి పౌరుడు రాజకీయాల్లో ఉంటారు. పౌర సమాజం ఎదుర్కొంటున్న సమస్యల పట్ల నేను మాట్లాడుతాను. పౌరహక్కులు, సామాజిక న్యాయం, ఆదేశిక సూత్రాలు గురించి మాట్లాడుతాను. నన్ను ఫలానా వ్యక్తి, నేను ఫలానా అని అంటున్నారు. వనరుల సంపద ఎవరి చేతిలో కేంద్రీకృతం అవ్వకూడదు. స్త్రీ పురుషులు సమానత్వం.. అని ఆదేశిక సూత్రాలు చెబుతాయి. నేను వాటిని నమ్ముతాను' అని జస్టిస్ సుదర్శన్ రెడ్డి చెప్పారు.



'నేను ఎన్ని సవాళ్లు వచ్చినా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నాను. రాజ్యాంగం మసకబారుతోంది. నావంతు కాదు.. ప్రతి పౌరులు గొంతెత్తి మాట్లాడాల్సిన సందర్భం. నేను కేవలం ఇండియా కూటమి అభ్యర్థిని మాత్రమే కాదు.. నేను ప్రతిపక్షాల అభ్యర్థిని. నేను ఇండియా కూటమిలో భాగస్వామ్యం కాలేదు కానీ.. నా అభ్యర్థిత్వానికి గురించి అడిగినప్పుడు నేను రాజ్యాంగం కాపాడాలంటే పోటీ చెయ్యాలి అనుకున్నాను. SIR... అని కొత్త వ్యవస్థ వచ్చింది. ప్రపంచ ఖ్యాతి గడించిన కృష్ణ అయ్యర్.. రిజర్వాయర్ ఆఫ్ పవర్ అన్నారు. ఈ దేశంలో ప్రజలు పౌరులు అయ్యాక ఓటర్లు అయ్యారు. ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడకపోతే.. ఓటర్ లిస్టులు మారుస్తారు. బిహార్లో జరుగుతున్న పోరాటం ప్రతిపక్షాలకు, అధికారపక్షానికి మధ్య జరుగుతుంది కాదు' అని ఇండియా కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డి తెలిపారు.

# నాలుగేళ్లు తెలంగాణలో చదివితేనే లోకల్.. సుప్రీంకోర్ట్ సంచలన తీర్పు..

తెలంగాణలో స్థానిక రిజర్వేషన్ల అంశం ఎప్పటి నుంచో వివాదాస్పదంగా కొనసాగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓ 33 ప్రకారం ఇంటర్మీడియట్‌కు ముందు వరుసగా నాలుగేళ్లు చదివిన విద్యార్థులనే స్థానికులుగా పరిగణించాలని స్పష్టం చేసింది. కానీ, కొందరు విద్యార్థులు దీన్ని సవాల్ చేస్తూ కోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను రద్దు చేస్తూ సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ప్రతి రాష్ట్రం తన స్థానిక రిజర్వేషన్ల కోసం తగిన నిబంధనలు రూపొందించుకునే అధికారం ఉందని సుప్రీంకోర్టులో తెలంగాణ రాష్ట్రం వాదనలు వినిపించింది.

అయితే రాష్ట్ర విభజన తర్వాత తమ పిల్లలు మరో రాష్ట్రంలో చదవాల్సి వచ్చిందని అభ్యర్థుల తరపున వాదనలు వినిపించారు పిటిషనర్లు. అయితే ఇప్పటికే రాష్ట్రంలో లోకల్ కోటా పై జీవో 33 ను అమలు చేస్తున్నామని తెలంగాణ ప్రభుత్వం సుప్రీం కోర్టుకు విన్నవించింది. అయితే ప్రభుత్వ ఉద్యోగులు తప్పని పరిస్థితుల్లో ఇతర రాష్ట్రాల్లో పని చేస్తున్నారని..దాంతో వాళ్ళ పిల్లలకు జీవో 33 నుంచి మినహాయింపు ఇస్తామని ప్రభుత్వం కోర్టుకు చెప్పింది. రాష్ట్రప్రభుత్వం చెప్పిన అంశాలను పరిగణలోకి తీసుకున్న సుప్రీం కోర్ట్ చీఫ్ జస్టిస్ బి ఆర్ గవాయ్ ధర్మాసనం తీర్పు వెల్లడించింది.

అయితే గతేడాది హైకోర్ట్ ఇచ్చిన తాత్కాలిక మినహాయింపుతో స్థానిక కోటా కింద ప్రయోజనం పొందిన విద్యార్థులు తమ ప్రయోజనాలను కొనసాగించవచ్చని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఇకపై ఎంబీబీఎస్, బీడీఎస్ యూజీ కోర్సులలో జీవో 33 ప్రకారమే స్థానిక కోటా రిజర్వేషన్లు అమలుకానున్నాయి. అయితే ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలకు మాత్రమే జీవో 33 నుంచి మినహాయింపు ఇస్తామనడంపై ప్రైవేటు ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము కూడా తప్పని పరిస్థితుల్లోనే రాష్ట్రాన్ని వదిలి ఇతర రాష్ట్రాల్లో ఉద్యోగాలు చేయాల్సి వస్తుందని తమ పిల్లల భవిష్యత్ గురించి ప్రభుత్వము కోర్టులు ఆలోచించాలని వేడుకుంటున్నారు.

# కవిత వ్యాఖ్యలతో అవినీతి జరిగిందనేది స్పష్టమైంది

**న్యూస్ డెస్క్, 01 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** మాజీ సీఎం కేసీఆర్‌పై కొందరు అగ్రనేతలు కుట్రలు చేస్తున్నారని.. వారి వెనుక సీఎం రేవంత్ రెడ్డి ఉన్నారంటూ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యల చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం హైదరాబాద్‌లో తెలంగాణ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ స్పందించారు. సీఎం రేవంత్ రెడ్డిపై కల్వకుంట్ల కవిత వ్యాఖ్యలను ఆయన ఖండించారు. కవిత చేసిన ఈ వ్యాఖ్యల ద్వారా కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందని తేలిపోయిందని స్పష్టం చేశారు.

కాళేశ్వరంలో తప్పు చేసింది కేసీఆరా? లేదా హరీశ్ రావా? అనేది తమకు అనవసరమన్నారు. వారి ప్రభుత్వ హయాంలోనే ఈ స్కాం జరిగిందనేది స్పష్టమైందని తెలిపారు. కవిత సైతం ఇప్పుడు అదే చెప్పారంటూ పీసీసీ చీఫ్ కుండ బద్దలు కొట్టారు. అయితే కాళేశ్వరం ప్రాజెక్ట్ అవినీతిలో మామ కేసీఆర్ వాటా ఎంత..? అల్లుడు హరీశ్ రావు వాటా ఎంత..? అనేది తేలాల్సి ఉందన్నారు.

కేసీఆర్ కుటుంబంలో మూడు ముక్కలాట ఫైనల్‌కి చేరిందని ఆయన వ్యంగ్యంగా అన్నారు. అయినా.. కుటుంబ కలహాలను తమపై రుద్దడం ఏంటంటూ కవితపై ఈ సందర్భంగా ఆయన మండిపడ్డారు. ఏమీ తప్పు చేయలేదంటున్న బీఆర్ఎస్ నేతలు.. సీబీఐ అనగానే ఎందుకు జంకుతున్నారంటూ వారిని సూటిగా ప్రశ్నించారు. వారు తప్పు చేయక పోతే విచారణ ఎదుర్కోవాలని బీఆర్ఎస్ నేతలకు సవాల్ విసిరారు. మొదటి దఫా ప్రభుత్వంలో ఇరిగేషన్ మంత్రిగా హరీశ్ రావు తప్పు చేస్తే.. ఆయనపై అప్పటి సీఎం కేసీఆర్ బాధ్యతగా ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు.

ఆ సమయంలోనే కల్వకుంట్ల కవిత సైతం ఎందుకు మాట్లాడ లేదు..? అంటూ టీపీసీసీ చీఫ్ సందేహం వ్యక్తం చేశారు. మొదట కేటీఆర్, అనంతరం కవిత అమెరికా పర్యటనకు వెళ్లి ఒక అవగాహన కదుర్చుకొని.. అంతర్గత కలహాలతో హరీష్‌రావును టార్గెట్ చేశారని పీసీసీ చీఫ్ పేర్కొన్నారు. కేసిఆర్ కుటుంబ కలహాలతో కాంగ్రెస్ పార్టీకి ఎటువంటి సంబంధం లేదని ఆయన కుండబద్దలు కొట్టారు.

బిఆర్ఎస్ పార్టీ అవినీతిని బయటపెట్టడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. కేసీఆర్ చుట్టూ దెయ్యాలున్నాయని గతంలో చెప్పిన కవిత.. ఆ దెయ్యాలు హరీశ్ రావు, సంతోష్ రావేనా..? ఇంకా ఎవరెవరు ఉన్నారో స్పష్టం చేయాలంటూ ఆమెను డిమాండ్ చేశారు. కవిత మాటలు నిజమా..? ఆదివారం అసెంబ్లీ మాట్లాడిన హరీశ్ రావు మాటలు నిజమా..? అనేది వారు స్పష్టం చేయాలంటూ పీసీసీ చీఫ్ మహేష్ డిమాండ్ చేశారు.

# సమగ్ర నివేదిక సమర్పిస్తే కేంద్రం దృష్టికి తీసుకెళతా

## : సీఎం రేవంత్

భారీ వర్షాలు, వరదలతో తలెత్తిన పరిస్థితులు, ఆయా ప్రాంతాల్లో వాటిల్లిన నష్టాలపై డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఉన్నత స్థాయి సమీక్ష, జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

వరదల సమయంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు, పశువులు కోల్పోయిన కుటుంబాలకు తక్షణమే పరిహారం విడుదల చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. గతేడాది ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో వర్షాలతో వాటిల్లిన తీవ్ర నష్టానికి కేంద్రం నుంచి రావలసిన సహాయం అందకపోవడంపై ఆరా తీసిన ఆ వివరాలతో పాటు ప్రస్తుత వరదల నష్టానికి సంబంధించిన వివరాలతో సమగ్రమైన నివేదికలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నేతృత్వంలోని బృందం ఈ నెల 4 వ తేదీన ఢిల్లీలో కేంద్ర మంత్రులను కలిసి ఆ రెండు నివేదికలకు అందజేస్తుందని చెప్పారు.వరదల కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా 257 చెరువులు, కుంటలకు గండి పడినట్టు అధికారులు చెప్పగా స్పందిస్తూ, చిన్న నీటి పారుదల విభాగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని, ఆర్ఆర్ఆర్, ప్రధానమంత్రి కృషి సంచాయ్ యోజన, ఇతర కేంద్ర ప్రాయోజిత పథకాలను వినియోగించుకొని చిన్న నీటి వనరులకు మరమ్మతులు, పునరుద్ధరణ పనులు చేపట్టాలని సూచించారు. గతంలో నీటి వినియోగదారుల సంఘాల ఆధ్వర్యంలో చెరువులు, కుంటలు, ప్రాజెక్టులు, డిస్ట్రిబ్యూటరీల వారీగా సంఘాలు ఉండేవి. ఆ సంఘాలకు సంబంధించిన నిబంధనలు పరిశీలించి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసి ప్రస్తుత పరిస్థితులకు తగ్గట్లు నూతన ప్రతిపాదనలతో నివేదిక సమర్పించాలని, దానిపై మంత్రివర్గంలో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

82 మండలాల్లో 2.36 లక్షల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని వ్యవసాయ శాఖ అధికారులు రూపొందించిన ప్రాథమిక అంచనాలపై స్పందిస్తూ రెండు రోజుల్లో పూర్తి వివరాలతో సమగ్ర నివేదిక సమర్పిస్తే కేంద్రం దృష్టికి తీసుకెళతామని చెప్పారు. నీట మునిగిన సబ్ స్టేషన్ల స్థానంలో అధునాతన సామగ్రి, సామర్థ్యంతో కూడిన సబ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ ముఖ్య కార్యదర్శిని ఆదేశించారు. పురపాలక, పంచాయతీరాజ్, జీహెచ్ఎంసీ పరిధిలో వీధి దీపాల ఏర్పాటు, నిర్వహణపై సమీక్ష నిర్వహించి పరిష్కారంతో రావాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుకి సూచించారు. ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్, తాగునీటి సరఫరా, పశు సంవర్ధక శాఖలు కూడా రెండు రోజుల్లో సమగ్ర నివేదికలు రూపొందించాలని ఆదేశించారు.

కామారెడ్డి, ఆదిలాబాద్, రాజన్న సిరిసిల్ల, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాల కలెక్టర్లతో మాట్లాడి అక్కడి పరిస్థితులపై ఆరా తీశారు. సహాయక పనులు వేగవంతం చేయాలని, పరిహారాలు వెంటనే విడుదల చేయాలన్నారు. అన్ని శాఖలు ఎస్డీఆర్ఎఫ్ నిధులను సక్రమంగా వినియోగించడంతో పాటు సకాలంలో వినియోగితా పత్రాలు (యూసీ) సమర్పించాలని సీఎం స్పష్టం చేశారు. విపత్తు సమయాల్లో స్పందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సొంతంగా ఏర్పాటు చేసిన ఎస్డీఆర్ఎఫ్ దళాలు వరదల సమయంలో మెరుగైన సేవలు అందించాయని అభినందనలు తెలిపారు. భారీ వర్షాల సమయంలో 42 ఆపరేషన్లలో పాల్గొని 217 మందిని ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది రక్షించడంపై ముఖ్యమంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సిబ్బందికి మరింత మెరుగైన శిక్షణ, నైపుణ్యాలు అందేలా చూడాలని రాష్ట్ర అగ్నిమాపక, విపత్తు స్పందన, పౌర సహాయక విభాగం డైరెక్టర్ జనరల్‌కి సూచించారు. వాతావరణ పరిస్థితుల్లో మార్పులు, ముందుందు అకాల వర్షాలు, వరదలు ఎక్కువగా వచ్చే ప్రమాదం ఉన్నందున జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు అప్రమత్తంగా ఉండడంతో పాటు విపత్తుల సమయంలో తక్షణమే క్షేత్ర స్థాయికి వెళ్లి సహాయక చర్యలను పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రస్తుతం వర్షాలకు తీవ్రంగా దెబ్బతిన్న జిల్లాల్లో పనులకు కంటింజెన్సీ కింద కలెక్టర్లకు రూ.10 కోట్లు, సాధారణ నష్టం వాటిల్లిన జిల్లా కలెక్టర్లకు రూ. 5 కోట్ల చొప్పున నిధులు విడుదల చేస్తామని తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# సీపీఎస్ ఉద్యోగులకు ఇదే చివరి విద్రోహదినం కావాలి..!

▶▶ సీపీఎస్ ను రద్దు చేయాలి ▶▶ ఒపీఎస్ విధానం అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ▶▶ సీపీఎస్ లో లోపాలున్నాయి కాబట్టి యూపీఎస్ వచ్చింది ▶▶ ప్రభుత్వంపై అర్థిక భారం లేదు ▶▶ ఒపీఎస్ అమలు చేస్తే సీఎం చరిత్రలో నిలుస్తారు ▶▶ సీపీఎస్ ఉద్యోగుల ఆత్మగౌరవ సభలో తెలంగాణ ఉద్యోగుల జేపీసీ ఛైర్మన్ వి.లచ్చిరెడ్డి





**హైదరాబాద్ బ్యూరో, 01 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** సీపీఎస్ ఉద్యోగులకు ఇదే చివరి విద్రోహదినం సెప్టెంబర్ 1వ తేదీ కావాలని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ఛైర్మన్ వి. లచ్చిరెడ్డి ఆకాంక్షించారు. సీపీఎస్ ను రద్దు చేసి ఒపీఎస్ విధానంను అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. సీపీఎస్ విధానంలో లోపాలున్నాయి కాబట్టి యూపీఎస్ వచ్చిందన్నారు. సీపీఎస్ రద్దు కోరుతూ తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ సంపూర్ణ మద్దతుతో తెలంగాణ సీపీఎస్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సీపీఎస్ ఉద్యోగుల ఆత్మగౌరవ సభలో లచ్చిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వంపై అర్థిక భారం లేదన్నారు. ఒపీఎస్ ను అమలు చేస్తే సీఎం చరిత్రలో నిలుస్తారన్నారు. కాంట్రిబ్యూషన్ పెన్షన్ స్కీమ్ ఉద్యోగులకు శాపంగా మారిందన్నారు. ఉద్యోగులకు పెన్షన్ భిక్ష కాదు కనీస హక్కు అన్నారు. రిటైర్డ్ ఉద్యోగులకు భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అన్నారు. అనేక క్లిష్ట పరిస్థితులను పరిష్కరిస్తున్న సీఎం గారు ఓపీఎస్ ను కూడా అమలు చేస్తారని ఆశాభావం వ్యక్తం చేస్తున్నాను అన్నారు. ప్రభుత్వం పై ఎలాంటి భారం లేదు కాబట్టి ఒపీఎస్ విధానం ను అమలు చేస్తే సీఎం రేవంత్ రెడ్డి గారు చరిత్రలో నిలిచిపోతారన్నారు. ఇదే సెప్టెంబర్ 1వ తేదీ సీపీఎస్ ఉద్యోగుల కు చివరి విద్రోహ దినం అవుతుందన్నారు. సీఎం గారు మన సమస్యను మానవీయ కోణంలో పరిష్కరిస్తోందని నమ్మకం ఉందన్నారు. రెవెన్యూ శాఖకు మళ్ళీ పూర్వ వైభవం తీసుకువచ్చినట్లుగానే సీపీఎస్ ఉద్యోగులకు మంచి రోజులు వస్తాయని లచ్చిరెడ్డి తెలిపారు. పెన్షన్ ప్రాథమిక హక్కు అని ఇటీవల సుప్రీం కోర్టు తన తీర్పులో వెల్లడించిందని సీపీఎస్ ఉద్యోగుల ఆత్మగౌరవ సభలో విశిష్ట అతిథులుగా పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ ప్రొ.కోదండరాం అన్నారు. పెన్షన్ గౌరవప్రథమంగా జీవించే హక్కులో భాగమే అన్నారు.ఇందులో కీలకమైన అంశాలు. పిక్స్ డ్ పెన్షన్, పిక్స్ డ్ పే మెంట్ వంటి మౌలిక తేడాలున్నాయన్నారు. అయితే మార్కెట్ లోని ఆటుపోట్లను బట్టి మన పెన్షన్ పై గ్యారెంటీ లేదన్నారు. ఉద్యోగి పెన్షన్ పెట్టుబడి దారుల చేతిలో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. పెన్షన్ ఉద్యోగుల హక్కుగా ప్రభుత్వం గుర్తించాలి. ఈ సభలోని అంశాలను ప్రభుత్వానికి చేర్చుతానని, గతంలో చీఫ్ సెక్రటరీ గారికి ఓ నివేదిక సమర్పించడం జరిగిందన్నారు. సీపీఎస్ ఉద్యమానికి నా వంతు మద్దతు ఉంటుంది. సీపీఎస్ ఉద్యోగుల సమస్య పై ఇప్పటికే గవర్నర్ తో పాటు అధికారులకు, కేంద్ర ప్రభుత్వానికి వినతులు ఇవ్వడం జరిగిందని ఎమ్మెల్సీ మల్క కొమురయ్య అన్నారు. ఉద్యోగుల ఆత్మగౌరవ సభలో ప్రత్యేక అతిథిగా పాల్గొన్న ఆయన రాష్ట్ర ప్రభుత్వం 2014లో నూతన పెన్షన్ విధానం కు ఒప్పుకోవడం వలన సీపీఎస్ అమలు జరుగుతుందన్నారు. నాకు ఓట్లు వేసి గెలిచిన ఉపాధ్యాయులకు రుణపడి ఉంటాను. మీకు నా సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. ఒపీఎస్ కోసం ప్రభుత్వాన్ని ఒప్పిద్దామని, లేదంటే.. సీపీఎస్ రద్దు కోసం పోరాడుదామని, మీ వెంట నేను ఉంటానని హామీ ఇచ్చారు. తెలంగాణ సీపీఎస్ ఉద్యోగుల గౌరవ అధ్యక్షులు కె.రామకృష్ణ గారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తూ ఉత్తర్వులు ఇవ్వాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి పాదించిన ఏకీకృత పెన్షన్ విధానాన్ని (యూపీఎస్) నిర్ద్వందంగా రాష్ట్ర ప్రభుత్వం తిరస్కరించాలన్నారు. షేర్ మార్కెట్ ఒడిదుడుకుల మీద ఆధారపడి పెన్షన్ ఇవ్వడమన్నది ఎండమావిలో నీటిని వెతకడమే అవుతుందిన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం ఆర్థిక భద్రత ఉంటేనే వృద్ధాప్యంలో వారు ఆత్మ గౌరవంతో జీవిస్తారన్నారు. పాత పెన్షన్ ప్రకటన కోసం రెండున్నర లక్షల పై చిలుకు ఉద్యోగ, ఉపాధ్యాయుల కుటుంబాలు ఎదురు చూస్తున్నాయన్నారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో నేటికి పాత పెన్షన్ విధానమే కొనసాగుతుందన్నారు. అలాగే హిమాచల్ ప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్గఢ్ ,జార?ండ్ కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో సి.పి.ఎస్ విధానాన్ని రద్దు చేసి ఒపీఎస్ విధానం ను అమలు చేస్తున్నారు. తమిళనాడు, కర్ణాటక ,పంజాబ్, తమిళనాడు రాష్ట్రాలు పాత పెన్షన్ పునరుద్ధరణకు సిద్ధమవుతున్నాయన్నారు. తెలంగాణ సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎస్.ఎల్. దర్శన్ గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జేఏసీ కో- ఛైర్మన్, తెలంగాణ డిప్యూటీ కలెక్టర్ల సంఘం జనరల్ సెక్రటరీ తెలంగాణ సీపీఎస్ ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షులు కె. రామకృష్ణ, జనరల్ నాగవల్లి ఉపేందర్, ఎస్.రాములు, రాధ, ఎం. శ్రీనివాస్ శంకర్, కె.హన్మంత్ రావు, దేవేందర్, జి.కృపాకర్, కె. రాములు, బాణాల రాంరెడ్డి, పాక రమేష్, డా.జి. నిర్మల, అశ్వథామారెడ్డి, డా. కత్తి జనార్ధన్, హబీబ్ మస్తాన్, గరికే ఉపేందర్ రావు, ఎస్.వి. సుబ్బయ్య, మహిపాల్ రెడ్డి, ఊదరి గోపాల్, పీహెచ్. రవి, ఎస్. నర్సింలు, రొక్కం దేవిక, బి. సుదర్శన్ గౌడ్, ఎం. చంద్ర శేఖర్ గౌడ్, కొంగల వెంకట్, కె. సాయిరెడ్డి, పి. లక్ష్మయ్య, ఎస్. నర్సింలు, ఆవుల సైదులు, రాందాస్, డా. రామకృష్ణ, ఎస్. హరి కిషన్, కె. సందీప్ కుమార్, మహమ్మద్ మోహినుద్దిన్, ఆర్. కిరణ్ కుమార్, శ్రీకాంత్, హేమలత, జి. మహేష్ కుమార్, సుగంధిని, రాంబాబు, చైతన్య క్రిష్ణ, మల్లేశం, రాందాస్ శోభన్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



# సిద్ధి వినాయక యూత్ ఆధ్వర్యంలో మహా అన్న ప్రసాద వితరణ

## ముఖ్య అతిథి గా రామసహాయం కృష్ణ కిషోర్ రెడ్డి



**తొర్రూరు, 01 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం మడిపల్లి గ్రామంలో సిద్ధి వినాయక యూత్ అసోసియేషన్ వారి ఆధ్వర్యం లో గణపతి నవ రాత్రి ఉత్సవాల సంద ర్భంగా సోమవారం మహా అన్న ప్రసాద వితరణ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రామసహాయం కృష్ణకిశోర్ రెడ్డి హాజరు అయ్యి గ్రామ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని, గ్రామం అభివృద్ధి చెందాలని ఆ విఘ్నేశ్వరుని ప్రార్థించారు. అనంతరం మహా అన్న ప్రసాద వితరణను ప్రారంభించారు. ఈ కార్యక్రమం లో రామసహాయం కృష్ణకిశోర్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ నల్లురి రామలింగం, కార్యకర్తలు గడీల పుల్లయ్య, నలమాస సంపత్, యూత్ సభ్యుల, గ్రామ ప్రజలు, ప్రజా ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.





# మాజీ సర్పంచ్ మృతికి ఎంపీ వద్దిరాజు సంతాపం



**ఖమ్మం బ్యూరో, 01 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం లచ్చిరాంతండా మాజీ సర్పంచ్ భబీచంద్ అకాల మృతి పట్ల బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తీవ్ర దిగ్భ్రాంతి చెందారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న భబీచంద్ ఆదివారం తుది శ్వాస విడిచారు. అమెరికా పర్యటనలో ఉన్న ఎంపీ రవిచంద్ర బీఆర్ఎస్ నాయకుడు, లచ్చిరాంతండామాజీ సర్పంచ్ భబీచంద్ మృతి వార్త తెలిసి దిగ్భ్రాంతికి లోనయ్యారు.తండా అభివృద్ధికి, రఘునాథ పాలెం మండలంలో పార్టీ బలోపేతానికి ఆయన చేసిన కృషిని ఎంపీ రవిచంద్ర ఒక ప్రకటనలో గుర్తు చేశారు. భబీచంద్ అకాల మరణంతో బీఆర్ఎస్ నిబద్ధత కలిగిన ఒక మంచి నాయకుడిని కోల్పోయిందని, ఆయన లేని లోటు పూడ్చలేనిదని ఎంపీ రవిచంద్ర అన్నారు.భబీచంద్ కుటుంబ సభ్యులకు ఎంపీ వద్దిరాజు తన ప్రగాఢ సంతాపం, సానుభూతి తెలిపారు,ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థించారు.


# గోకుల కృష్ణ సేవా సమితి ట్రస్టుకు వాటర్ ప్లాంట్ బహూకరణ



**ఖమ్మం టౌన్, 01 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** ఖమ్మంలో మధురానగర్ కాలనీలో గోకుల్ కృష్ణ సేవా సమితి ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోకుల్ బాయ్స్ హాస్టల్ కు గంటకు 100 లీటర్ల కెపాసిటీతో 500 లీటర్ల సామర్థ్యం ఉన్న ట్యాంకును అమర్చిన సుమారు 80000 విలువచేసే వాటర్ ఫిల్టర్ ను మద్దులపల్లి మార్కెట్ ఛైర్మన్ వైరు హరినాథ్ బాబు తన సొంత డబ్బులతో బహూకరించి, సోమవారం ట్రస్ట్ ఛైర్మన్ కూరాకుల నాగభూషణం యాదవ్ గారితో, గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు అమర గాని వెంకన్న గౌడ్ గార్లతో కలిసి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ సామాజిక సేవలో ముందుంటూ అనేకమంది బేధ విద్యార్థులకు ట్రస్టు ఆధ్వర్యంలో చదివి చదివించడమే కాకుండా, తక్కువ ఖర్చుతో హాస్టల్ నిర్వహిస్తున్న కూరాకుల నాగభూషణం యాదవ్ గారిని అభినందిస్తూ వారిని ఇంకా ముందుకు నడిపించేందుకు కోసమే తను ఈ వాటర్ ఫిల్టర్ ను బహుమతిగా ఇచ్చానని, రానున్న కాలంలో బీసీ విద్యార్థులంతా కష్టపడి చదివి ఉన్నత స్థానాలు అధిరోహించాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమం లో తెలంగాణ యాదవ మహాసభ ఖమ్మం జిల్లా అధ్యక్షులు కోడి లింగయ్య యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ హాస్టల్ ఇన్చార్జ్ భారీ మల్సూర్ యాదవ్, రాష్ట్ర నాయకులు మూడుముందుల గంగరాజు యాదవ్, అకడమిక్ కన్వీనర్ బట్టు శ్రీనివాస్ యాదవ్, గౌడ సంఘం నాయకులు దానయ్య గౌడ్, పంది రాజు గౌడ్, బీసీ జేఏసీ కన్వీనర్ పెరుగు వెంకటరమణ యాదవ్, విద్యావంతుల వేదిక నాయకులు యాదాల నాగేశ్వరావు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఖానాపురం హవేలీ ఎస్ఐ ఔదార్యం

## దహన సంస్కారాలకు ఆర్థిక సాయం



**దానవాయిగూడెం, 01 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** పాలేరు నియోజకవర్గంలోని 59వ డివిజన్ దానవాయిగూడెం కాలనీలో విషాదం నెలకొంది. స్థానికుడు బొడ్డు కృష్ణ సోమవారం ఉదయం నడుచుకుంటూ వెళ్తుండగా ప్రమాదవశాత్తు కిందపడిపోవడంతో తలకు రాయి తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ నేపథ్యంలో పంచనామా నిర్వహించేందుకు అక్కడికి చేరుకున్న ఖానాపురం హవేలీ ఎస్ఐ శ్రావణ్ మానవత్వాన్ని చాటుకున్నారు. బాధిత కుటుంబ పరిస్థితులు స్థానికుల ద్వారా తెలుసుకుని దహన సంస్కారాలకు తనవంతు సాయంగా రూ.5 వేలు అందజేశారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు చల్లా కృష్ణ తదితరులు కూడా అక్కడ పాల్గొని కుటుంబానికి ధైర్యం చెప్పారు. ఎస్ఐ ఔదార్యానికి గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

# కాళేశ్వరం పై కుట్ర జరుగుతోంది

## వాషింగ్టన్ డీసీ నుంచి ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ప్రకటన



**హైదరాబాద్ బ్యూరో, 01 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** కాళేశ్వరం ప్రాజెక్ట్ అంశాన్ని సీబీఐకి అప్పగించడం బీజేపీ, కాంగ్రెస్ రాజకీయ కుట్రలో భాగమేనని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర స్పష్టం చేశారు.తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు గొప్పగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టును ఎండబెట్టి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి నీళ్లను తరలించడానికి చంద్రబాబు నాయుడు చెప్పినట్లుగా రేవంత్ రెడ్డి నడుచుకుంటున్నారన్నారు. సీబీఐ విచారణ పేరుతో కేసీఆర్, హరీష్ రావులను ముట్టుకుంటే తెలంగాణ ప్రజలు సహించబోరని, ఇందుకు కాంగ్రెస్, బీజేపీలు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ఎంపీ రవిచంద్ర హెచ్చరించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై రేవంత్ తప్పుడు ప్రచారం చేసి తెలంగాణ పేరు ప్రతిష్ఠల్ని మంటగల్పడమే కాక,ఈ అంశాన్ని సీబీఐ విచారణకు సిఫార్సు చేయడాన్ని ఎంపీ రవిచంద్ర ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకాన్ని పూర్తిగా ఎండబెట్టి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి నీళ్లను తరలించే కుట్రలో భాగమేనని ఆయన స్పష్టం చేశారు.ప్రధాని నరేంద్రమోడీ-ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పినట్టుగా రేవంత్ వ్యవహారం ఉందన్నారు. బీజేపీ, కాంగ్రెస్ కలిసి చేస్తున్న ఈ కుట్రలను బీఆర్ఎస్ శ్రేణులు ప్రతిఘటించాలని ఎంపీ రవిచంద్ర కోరారు. ఇది కేసీఆర్కు వ్యతిరేకంగా జరుగుతున్న కుట్ర మాత్రమే కాదని, తెలంగాణ నీళ్లను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తరలించి, కాళేశ్వరాన్ని ఎండబెట్టే కుయుక్తుల్లో భాగంగానే చూడాలని ఎంపీ రవిచంద్ర పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం,ప్రజల ప్రయోజనాలే బీఆర్ఎస్ కు ముఖ్యమని,ఇందుకోసం పార్లమెంట్ లోపల,బయట పోరాడుతామన్నారు.బీజేపీ ప్రభుత్వానికి సీబీఐ ఒక అస్త్రంగా తయారై ప్రతిపక్షాలను ఇబ్బందులు పెడుతున్నదంటున్న రాహుల్ గాంధీ తెలంగాణ ముఖ్యమంత్రి తీసుకున్న ఈ నిర్ణయంపై తన వైఖరిని స్పష్టం చేయాలని ఎంపీ వద్దిరాజు డిమాండ్ చేశారు.

# బీసీ లను ఇంకెంత కాలం మోసం చేస్తారు..?

## వాషింగ్టన్ డీసీ సాక్షిగా కాంగ్రెస్ పై నిప్పులు చెరిగిన ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

### గ్లోబల్ మున్నూరుకాపు మహాసభలో ఎంపీ సూపర్ స్పీచ్




**హైదరాబాద్ బ్యూరో, 01 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** చావు నోట్లో తల పెట్టి తెలంగాణ ను సాధించి, దేశంలోనే స్వరాష్ట్రాన్ని అగ్రగామిగా మార్చిన కేసీఆర్ పైన, అయన చేసిన అభివృద్ధి పైన కాంగ్రెస్ కుట్రలు చేస్తోంది అని వాషింగ్టన్ డిసి లో జరిగిన గ్లోబల్ మున్నూరు కాపు మహాసభ సాక్షిగా ఎంపీ వద్దిరాజురవిచంద్ర నిప్పులు చెరిగారు.బీసీలకు 42% రిజర్వేషన్స్ కల్పిస్తామని కామారెడ్డి బహిరంగ సభలో కాంగ్రెస్ ప్రకటించి, మేనిఫెస్టోలో పెట్టి, పలుమార్లు ఊదరగొట్టి, ఇప్పుడు అసెంబ్లీ సాక్షిగా మోసం చేస్తున్నదని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు వద్దిరాజు రవిచంద్ర ఆందోళన వ్యక్తం చేశారు. పార్లమెంటులో చట్టం చేసి రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్ లో పొందుపర్చకుండా రిజర్వేషన్స్ అమలు సాధ్యం కాదని తెలిసి కూడా ఓట్లు దండుకునేందుకు కాంగ్రెస్ మభ్యపెట్టిందని ఆయన మండిపడ్డారు. గ్లోబల్ మున్నూరుకాపు అసోసియేషన్ ఆధ్వర్యాన అమెరికాలోని లీస్ బర్గ్ వద్ద మహాసభ (కన్వెన్షన్) ఏర్పాటైంది. ఉత్సాహభరిత వాతావరణంలో జరిగిన ఈ సభకు ఎంపీ రవిచంద్ర ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన ఆదివారం రాత్రి (ఇండియా లో సోమవారం ఉదయం) మాట్లాడుతూ, కాంగ్రెస్ సర్కార్ మున్నూరుకాపుల జనాభాను ఉద్దేశపూర్వకంగా తక్కువ చేసి చూపడమే కాక మంత్రి పదవి ఇవ్వకుండా అవమానించడం బాధాకరమన్నారు. కాంగ్రెస్ నుంచి గెలిచిన ఏకైక ఎమ్మెల్యే మన మున్నూరుకాపు ముద్దుబిడ్డ ఆది శ్రీనివాస్ ను వెంటనే మంత్రివర్గంలోకి తీసుకోవాలని ఎంపీ రవిచంద్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని డిమాండ్ చేశారు. మున్నూరుకాపులం సమాజానికి పెద్ద దిక్కుగా ఉంటూ కాపు కాసే వారమని, రైతుబిడ్డలమని, పదిమందికి అన్నం పెట్టే అన్నదాతల మన్నారు. మనం ఇటువంటి మంచి సభల ద్వారా మరింత సంఘటితమవుతూ ఇతర బీసీ కులాల వారితో స్నేహంగా ఉంటూ రాజ్యాధికారం వైపు పయనిద్దామని ఎంపీ రవిచంద్ర పిలుపునిచ్చారు. ఈ నగరాల శివార్లలో భూములు కొని భవనాలు కట్టాల్సిందిగా ఎంపీ వద్దిరాజు సూచించారు. విదేశాలలో ఇబ్బందులకు గురైన తెలంగాణ బిడ్డలకు తనతో పాటు బీఆర్ఎస్ ఎల్లవేళలా అండగా ఉంటుందని ఎంపీ వద్దిరాజు భరోసానిచ్చారు. దేశమంతా కూడా ఇప్పుడు బీసీ వాదం బలంగా వినిపిస్తున్నదని, మున్నూరుకాపులం ఎవరి కంటే కూడా తక్కువ కాదని, ఇతరులను కించపర్చకుండా కలుపుకుంటూపోతూ నాయకత్వం వహించాల్సి ఉందన్నారు. మున్నూరు కాపులతో పాటు బీసీలను మరింత చైతన్య పర్చేందుకు, సంఘటితం చేసేందుకు ఈ మహాసభను ఏర్పాటు చేసిన రజనీకాంత్, వెంకట్, వారి మిత్ర బృందాన్ని ఎంపీ వద్దిరాజు అభినందించారు. అమెరికాలోనే కాకుండా ఇతర దేశాలలో స్థిరపడిన మీరంతా తెలుగు రాష్ట్రాలతో పాటు ఇండియా మొత్తానికి ఉపయోగపడాలని, బహుజనుల అభ్యున్నతి కోసం సుదీర్ఘ ప్రయాణం చేయాల్సి ఉందని ఎంపీ వద్దిరాజు అన్నారు. బతుకమ్మ,దసరా, దీపావళి, సంక్రాంతి, ఉగాది పండుగలను మరిపించే విధంగా ఉల్లాసభరిత



విషయంలో మనం పవన్ కళ్యాణ్ ను ఆదర్శంగా తీసుకుద్దామని, 2019లో ఆయన పార్టీ ఓకే ఒక్క సీటు గెలిచినా కూడా నిరాశ చెందకుండా ముందుకు సాగుతూ 2024లో పోటీ చేసిన అన్ని సీట్లను జనసేన గెల్చుకున్నదన్నారు. విదేశాలలో స్థిరపడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వారు గత ఎన్నికల సందర్భంగా తమ తమ స్వస్థలాలకు వెళ్లి ప్రచారంలో చురుకైన పాత్ర పోషించారని ఎంపీ రవిచంద్ర చెప్పారు. అదేవిధంగా మన తెలంగాణ బిడ్డలు వీలు చూసుకుని స్వగ్రామాలను సందర్శిస్తూ రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొనాలని, ఆసక్తి ఉన్న వాళ్లు ఎన్నికల్లో పోటీ చేయాలని ఎంపీ వద్దిరాజు దిశానిర్దేశం చేశారు.మున్నూరుకాపులం ఆర్థికంగా ఎదిగేందుకు తమ పిల్లలను బాగా చదివించాలని, గుజారాతీలను ఆదర్శంగా తీసుకుని వ్యాపారవేత్తలుగా ఎదగాలని సలహానిచ్చారు.తాను 30 ఏండ్ల కిందట గాయత్రి గ్రానైట్స్ కంపెనీ స్థాపించి కష్టపడుతూ అంచెలంచెలుగా ఎదిగి 2వేల మందికి ఉద్యోగాలిచ్చానని ఎంపీ రవిచంద్ర పేర్కొన్నారు. ఢిల్లీలోని జాతీయ పోలీస్ మెమోరియంలో నెలకొల్పిన 370 టన్నుల మ్యాన్యుమెంట్, కర్తవ్యపథ్ లో ప్రతిష్ఠించిన నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహాలకు బ్లాక్ గ్రానైట్ అందించానన్నారు. మాజీ మంత్రి కే.టీ.రామారావు ఐటీ రంగాన్ని గొప్పగా అభివృద్ధి చేశారని, 3 నెలల కిందట డల్లాస్ నగరంలో బీఆర్ఎస్ సభ జరిగినప్పుడు ఆయనపై అభిమానంతో వేలాది మంది యువకులు హాజరైన విషయాన్ని ఎంపీ రవిచంద్ర గుర్తు చేశారు. అమెరికాకు వచ్చే,వచ్చిన యువతకు తలెత్తే ఇబ్బందులను పరిష్కరిస్తూ కొండంత అండగా నిలవాలని గ్లోబల్ మున్నూరుకాపు అసోసియేషన్, ఆప్తా, నాట్స్, ఆటా సభ్యులను ఎంపీ రవిచంద్ర కోరారు. ఇమ్మిగ్రేషన్, వీసా విషయాలలో, చిరు వ్యాపారులు, పేద విద్యార్థులకు ఇక్కడ స్థిరపడిన మీరు చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. ఇక్కడి ప్రభుత్వ విధానాల వల్ల ఉద్యోగాలు రాక, కోల్పోయిన వారికి ఆశ్రయం కల్పించేందుకు వాషింగ్టన్, చికాగో, న్యూయార్క్, న్యూజెర్సీ,లాస్ ఏంజిల్స్ వంటి

వాతావరణంలో ఈ మహాసభ జరిగిందని, రుచికరమైన మన తెలంగాణ వంటకాలతో కడుపునిండా భోజనం చేశామన్నారు. ఈ సందర్భంగా మహాసభ నిర్వాహకులు ఎంపీ రవిచంద్రను శాలువాలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికను ప్రదానం చేశారు. అంతర్జాతీయ షూటింగ్ పోటీలలో ప్రతిభాపాటవాలు చాటుతూ సిల్వల్ మెడల్స్ గెల్చుకున్న పోలీస్ అధికారి సాధుల సారంగపాణి కూతురు మేఘన ను ఎంపీ రవిచంద్ర శాలువాతో సత్కరించి, జ్ఞాపికను ప్రదానం చేశారు.ఆహ్లాదకరమైన వాతావరణంలో రెండు రోజుల పాటు ఘనంగా జరిగిన ఈ మహాసభలో ఇండియాలోని పలు రాష్ట్రాలు, అమెరికా, కెనడా, ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా, ఖతర్ తదితర దేశాలలో నివసిస్తున్న వందలాది పాల్గొన్నారు. మాజీ కేంద్ర మంత్రి పల్లంరాజు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, రాయచూరు మాజీ ఎమ్మెల్యే పాపారెడ్డి, రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్,ప్రముఖ సినీ గేయ రచయిత, ఆస్కార్ అవార్డు గ్రహీత చంద్రబోస్, సుంకర బాలకిషన్, చల్లా హరిశంకర్, ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్,కొండా దేవయ్య,ప్రముఖ ఇంద్రజాలకులు సామల వేణు,చల్లా స్వరూపరాణి, మిరియాల రాఘవరావు, డాక్టర్ శివప్రసాద్, రాజలింగోళ్ల శృంగాద్రి కుమార్, గంగవ్వ, జయశ్రీ, తదితర ప్రముఖులు అతిథులుగా హాజరయ్యారు. ఈ మహాసభ సందర్భంగా వేసిన రంగురంగుల ముగ్గులు (రంగవల్లులు)అందరిని ఆకర్షించాయి, ఏర్పాటు చేసిన సింగీత విభావరి, నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను అలరించాయి.



## నిఖిల్ భట్ యూనివర్సల్ స్టూడియోస్‌తో హాలీవుడ్‌లో అరంగేట్రం!



**మూవీ న్యూస్, 01 సెప్టెంబర్ (కెరటం న్యూస్): హైదరాబాద్: సెప్టెంబర్ 1, 2025 –** ఇండియన్ సినిమా డైరెక్టర్ నిఖిల్ భట్ తన టాలెంట్‌ని గ్లోబల్ ప్లాట్‌ఫామ్‌పై ప్రదర్శించడానికి సిద్ధమయ్యారు. ఆయన ప్రఖ్యాత యూనివర్సల్ స్టూడియోస్‌తో చేతులు కలిపి తన హాలీవుడ్ డైరెక్టోరియల్ డెబ్యూని ప్రకటించారు. ఇటీవల రిలీజ్ అయిన ఆయన యాక్షన్ థ్రిల్లర్ 'కిల్' గ్లోబల్ ఆడియన్స్‌ని ఆకట్టుకుని, యాక్షన్ సినిమా జానర్‌లో కొత్త బెంచ్‌మార్క్ సెట్ చేసింది. ఈ కొత్త ప్రాజెక్ట్ గురించి ఒక అఫీషియల్ సోర్స్ మాట్లాడుతూ, "నిఖిల్ భట్ మరియు యూనివర్సల్ స్టూడియోస్ మధ్య చర్చలు చాలా కాలంగా జరుగుతున్నాయి, ఇప్పుడు అన్ని డీల్స్ ఫైనల్ అయ్యాయి. ఇది ఒక హై-ఆక్టేన్ యాక్షన్ ఫిల్మ్. ఇది చాలా పెద్ద బడ్జెట్‌తో మరియు ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్‌లో రూపొందనుంది. ఈ మూవీ నిఖిల్ భట్‌ను గ్లోబల్ డైరెక్టర్స్‌లో ఒకరిగా నిలబెడుతుంది," అని పేర్కొన్నారు.ఈ ప్రాజెక్ట్‌లో ఒక ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, ఈ సినిమాలో టాప్ హాలీవుడ్ యాక్టర్స్ నటించనున్నారు. స్క్రిప్ట్ డిమాండ్స్ కారణంగా, గ్లోబల్ స్టార్స్‌ని కాస్ట్ చేయాలని టీమ్ ప్లాన్ చేస్తోంది. నటీనటుల పేర్లు ప్రస్తుతం డిస్కషన్స్‌లో ఉన్నాయి, త్వరలోనే అఫీషియల్‌గా అనౌన్స్ చేయనున్నారు.ఈ సినిమా షూటింగ్ 2026లో స్టార్ట్ కానుంది. ప్రస్తుతం నిఖిల్ భట్ మురాద్ ఖేటానీతో కలిసి మరో సినిమా ప్రీ-ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉన్నారు.

## 'లక్ష్మీ' కలయికలో మరొకటి..



**మూవీ న్యూస్, 01 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** వెంకటేశ్ – వి.వి.వినాయక్ కలయికలో మరో చిత్రం కోసం సన్నాహాలు ఊపందుకున్నాయి. ప్రస్తుతం కథా చర్చలు జరుగుతున్నాయి. అన్నీ కుదిరితే త్వరలోనే ఈ సినిమా ప్రారంభమయ్యే అవకాశాలున్నాయి. ఇదివరకు ఈ కలయికలో రూపొందిన 'లక్ష్మీ' ఘన విజయాన్ని సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. ఆ సినిమాకి ఆకుల శివ కథని అందించారు. ఆయనే మరోసారి వెంకటేశ్ కోసం కథని సిద్ధం చేశారు. వి.వి.వినాయక్ తన మాస్ సినిమాల్ని గుర్తు చేసేలా... ఎక్కువ కామెడీ, కొంచెం యాక్షన్ మేళవింపుతో ఈ స్క్రిప్ట్‌ని మలుస్తున్నారని సమాచారం. 'లక్ష్మీ'ని రూపొందించిన నల్లమలుపు బుజ్జి నిర్మాణంలోనే ఈసారి చిత్రం కూడా రానుంది. వెంకటేశ్ ప్రస్తుతం త్రివిక్రమ్ దర్శకత్వంలో సినిమా చేస్తున్నారు. చిరంజీవి కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'మన శంకరవరప్రసాద్‌గారు'లోనూ ఓ కీలక పాత్ర పోషిస్తున్నారు.

## రజనీ చిత్రంలో విద్యాబాలన్?



**మూవీ న్యూస్, 01 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** 'కూలీ'గా ఇటీవలే ప్రేక్షకుల్ని పలకరించారు కథానాయకుడు రజనీకాంత్. ఇప్పుడు మళ్లీ 'జైలర్ 2'ను పూర్తి చేయడంపై దృష్టి సారించారు. విజయవంతమైన 'జైలర్' సినిమాకి కొనసాగింపుగా నెల్సన్ దిలీప్ కుమార్ తెరకెక్కిస్తున్న పాన్ ఇండియా చిత్రమిది. సన్ పిక్చర్స్ సంస్థ నిర్మిస్తోంది. రమ్యకృష్ణ, మిర్నా మేనన్, ఎస్‌జే సూర్య తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. మోహన్‌లాల్, శివ రాజ్‌కుమార్ ప్రత్యేక పాత్రల్లో కనువిందు చేయనున్న సంగతి తెలిసిందే. కాగా, ఇప్పుడిందులోని ఓ ముఖ్య పాత్ర కోసం బాలీవుడ్ నటి విద్యాబాలన్‌ను రంగంలోకి దించనున్నట్లు తమిళ సినీ వర్గాల నుంచి సమాచారం అందుతోంది. ఇప్పటికే ఈ విషయమై ఆమెతో సంప్రదింపులు పూర్తయ్యాయని.. తన పాత్ర నచ్చడంతో సానుకూలంగా స్పందించిందని తెలిసింది. ఈ సినిమా ప్రస్తుతం చెన్నైలో శరవేగంగా చిత్రీకరణ చేసుకుంటోంది. ఈ చిత్రంలో నందమూరి బాలకృష్ణ కూడా ఓ ప్రత్యేక పాత్రలో కనువిందు చేయనున్నట్లు ప్రచారం సాగుతోంది. ఈ సినిమా అన్ని కార్యక్రమాల్ని పూర్తి చేసుకుని వచ్చే ఏడాది ద్వితీయార్థంలో తెరపైకి వచ్చే అవకాశముంది. ఈ చిత్రానికి అనిరుధ్ సంగీతమందిస్తున్నారు.